ఎదురుగా అత్యద్భుతమైన అందంతో ప్రకృతి పరవళ్లు తొక్కుతోంది. పరవశింపచేస్తోంది. మేము కొండ అంచున ఉన్నాం. క్రింద అగాధం లాంటిలోయ. ఆ లోయలో వంపులు తిరుగుతూ యమునా నది ప్రవహిస్తోంది.


అది చూస్తూ నేను మైమరచి పోయాను. శ్యామ్ సంగతి చెప్పనే అవసరం లేదు.

నా స్నేహితుడు శ్యామ్ పెయింటర్. వాడితో కలిసి షిమ్లా వచ్చాను.

'షిమ్లా' అందాలను దర్శిస్తూ తిరుగుతున్నాం. అలవికాని ఆనంద ప్రపంచంలో ఈదులాడుతున్నాం.


అంతా పరవశించి చూస్తున్న మా ఇద్దరి దృష్టి ఒకేసారి, శిఖరంపై నున్న ఆ గుడిసెపై పడింది.

'ఎంత అదృష్టవంతుడు కదా, ఇంతటి సుందరదృశ్యాల నడుమ ఒంటరిగా జీవించగలుగుతున్నాడు' పైకి అనేశాను.



# చిత్రపటం

# హారర్ స్టోరీ



## కస్తూరి మురళీకృష్ణ

‘ఎవరో చూద్దామా?’ అడిగాడు శ్యామ్.

‘సరే’ నన్నాను. వెంటనే ఇద్దరం ఆ వైపు బయలుదేరాము.

గుడిసె దగ్గరకి చేరుకున్నాం. తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి.

‘హలో’ పిలిచాడు శ్యామ్.

లోపల నుంచి ఎలాంటి శబ్దం లేదు.

నేనూ పిలిచాను. ‘ఎవరైనా ఉన్నారా?’

లోపల నుంచి గాలి బయటకు బలంగా వచ్చినట్టు అనిపించింది.

మరో రెండు మూడు మార్లు మార్చి మార్చి పిలిచాను. ఎలాంటి స్పందన లేదు.

‘వెళ్దాం. ఎవరూ లేనట్టుంది’ అన్నాను.

శ్యామ్ అడుగుముందుకు వేశాడు. తలుపు తట్టాలని చెయ్యెత్తాడు. అతడి చేయి తలుపును తాకకముందే, తలుపు దానంతట అదే తెరచుకుంది.

ఇద్దరం ఒకరి ముఖాలొకరం చూసుకున్నాం.

కుతూహలంగా లోపలకు తొంగి చూశాం. చిక్కటి చీకటి కనిపించింది. నేను ఒక్కక్షణం సంశయించాను. కానీ శ్యామ్ లోపలకు అడుగు పెట్టాడు. దాంతో అతడిని అనుసరించాను.

లోపల అడుగు పెడుతూంటే, ఎందుకో తెలియదు. వేరే లోకంలోకి అడుగు పెడుతున్న భావన మెరుపులా మెరిసి మాయమయింది.

లోపల చీకటికి కళ్లు అలవాటయ్యాయి. అక్కడ కనబడుతున్న వాటిని చూస్తుంటే నా కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

వాటిని చూస్తున్న శ్యామ్ అయితే ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని పట్టలేక పోతున్నాడు.

గది నిండా అత్యద్భుతమయిన పెయింటింగులు విచ్చలవిడిగా వెదజల్లి ఉన్నాయి.

వాటిల్లో, ఇందాక మేము చూసిన దృశ్యం కనిపించింది. కానీ, మేము చూసిన యమున చిన్న పాయలాంటిది. రిబ్బన్ లాంటిది. కానీ ఈ పెయింటింగ్‌లో యమున పరవళ్ళు తొక్కుతోంది.

లోయ సగం పైగా నీట మునిగింది.

శ్యామ్‌కు ఈ పెయింటింగ్ చూపించాను.

‘ఏ వెయ్యేళ్ల క్రితమో యమున ఇలా ప్రవహించి ఉంటుంది’ అన్నాడు శ్యామ్

‘కళాకారుడి ఊహ ఎంత అద్భుతమయినది కదా!’ అన్నాను.

ఇంతలో నా దృష్టి కేన్వాసుపై పడింది. అది అసహజంగా అనిపించింది. ఇప్పుడు శ్యామ్ వాడుతున్న కేన్వాసులా లేదని, నేను దాన్ని శ్యామ్ దృష్టికి తెచ్చే లోగా , నా దృష్టి మళ్లింది.

‘అరే, ఇదెందుకు ఇలా ఉంది?’ అంటూ అన్నిటికీ దూరంగా, ప్రత్యేకంగా ఉన్న ఓ పెయింటింగ్ వైపువెళ్లాడు శ్యామ్. ఆ పెయింటింగ్ కనబడకుండా అది ఓ రకమైన గుడ్డలో చుట్టి ఉంది.

దాన్ని శ్యామ్ తాకేందుకు చేయి సాచాడు.

‘ఆగండి. దాన్ని తాకకండి’ కఠినంగా వినిపించిందో స్వరం.

ఇద్దరం ఉలిక్కిపడ్డాం. తలుపు వైపు చూశాం. శ్యామ్ చేతిలోంచి పెయింటింగ్ జారి పడింది.

తలుపు దగ్గర ఓ పొడుగైన వ్యక్తి నిలబడి ఉన్నాడు. వెలుతురు అతని వెనుక ఉండటంతో ఆయన వెలుతురుకు అడ్డంగా నిలబడ్డాడు. దాంతో అతడిని తాకిన వెలుతురు, అతడి శరీరం అంచుల నుండి గదిలోకి వంగి దూకుతోంది. అందువల్ల అతని శరీరాన్ని వెలుతురు చుట్టుకున్న భావన కలుగుతోంది. అతడు తేజోవలయంలా అనిపిస్తున్నాడు.

ఎందుకో ఓ రకమైన ఉద్విగ్నత కలిగింది నాకు. గుండె కొట్టుకునే వేగం పెరిగింది. వాళ్లంతా చెమటలు పట్టాయి.

‘సారీ’ ఏదో అనబోయాను. గొంతులోంచి మాట రాలేదు.

అతడు లోపలకు వచ్చాడు. క్రిందపడ్డ ఆ పెయింటింగ్‌ను ఎంతో ప్రేమగా తీశాడు.

‘దెబ్బతగిలిందా?’ అప్యాయంగా, లాలనగా ఆ పెయింటింగ్‌ను అడిగాడా వ్యక్తి. అది చూస్తుంటే, ఎందుకో, అదో రకమైన జలదరింపు ఒళ్లంతా జరజరా పాకింది. అతడు ఆ పెయింటింగ్‌తో మనిషితో మాట్లాడినట్టు మాట్లాడుతున్నాడు.

ఆ పెయింటింగ్‌ను పక్కకుపెట్టి మా వైపు తిరిగాడు.

‘ఎవరు మీరు? ఏం కావాలి?’ అడిగాడు.

మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాం.

‘చాలా అద్భుతంగా ఉంది మీ చిత్రలేఖన కౌశలం. ఇంత అజ్ఞాతంగా, మారుమూల మీ కళను దాచుకోవటం అన్యాయం’ అన్నాను నేను.

అతడు మాట్లాడలేదు.

‘అదేం పెయింటింగ్? దాన్నెందుకలా చుట్టి దాచారు?’ అడిగాడు శ్యామ్.

‘అది తెలుసుకోక పోవటం మీకే మంచిది’ అన్నాడతడు ముక్తసరిగా.

‘కనీసం ఒసారి దాన్ని చూపిస్తారా?’ అడిగాడు శ్యామ్.

‘అది చూడకపోవటం మీకే మంచిది’ అన్నాడతడు తీవ్రంగా.

ఆ తీవ్రత నాలో భయం కలిగించింది. ‘పద పోదాం, శ్యామ్’ అన్నాను.

నా మాట వినిపించుకోలేదు శ్యామ్. ‘ఎందుకని? నేను దేనికీ భయపడను. ఇంత గొప్పబొమ్మలు గీసి అజ్ఞాతంగా వదిలేసిన మీరు, ఇంకేదో అద్భుతమైన చిత్రలేఖనాన్ని బంధించి ఉంచినట్టు అనిపిస్తోంది. దాన్ని నేను చూసి తీరాలి’ అడుగు ముందుకేశాడు శ్యామ్.

అతడు ఒక అడుగు వెనక్కు వేశాడు.

‘మీరు ఏరికోరి ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు’ అన్నాడు.

‘ఏమిటి ప్రమాదం?’ అడిగాడు శ్యామ్.

‘ఆ పెయింటింగ్ చూసే ముందు మీకో కథ చెప్తాను. ఆ తరువాత దాన్ని చూడాలా, వద్దా అన్నది మీరే నిర్ణయించుకోండి’ అన్నాడతడు.

‘ఏమిటా కథ?’ అడిగాడు శ్యామ్.

అతడు నిట్టూర్చి చెప్పటం ఆరంభించాడు. బయట ఉరుములు మెరుపులతో వాన ప్రారంభమయింది.

‘అనగనగా ఒక ఊరు. ఇప్పుడు. ఇంత ఆధునిక ప్రపంచంలో కూడా కుల పట్టింపు ఇంతగా ఉన్నాయంటే, ఆ కాలంలో ఎంతగా ఉండేవో ఊహించండి. అటువంటి సమాజంలో మీనా, తన కులవృత్తికి భిన్నంగా చిత్రలేఖనంపై మక్కువ పెంచుకుంది. వంశపారంపర్యంగా చిత్ర లేఖనంపై ఆధారపడిన వారికన్నా సృజనాత్మకంగా అద్భుతంగా ఆమె కళను సృజించేది.’

‘ఈ బొమ్మలు ఆమె గీసినవేనా?’ అడగకుండా ఉండలేక పోయాను.

శ్యామ్ నావైపు కోపంగా చూశాడు. ‘మధ్యలో డిస్టర్బ్ చేయకు?’ కసురు కున్నాడు.

‘ఆమె కళను చూసి, ఆ ఊరిలోని ఓ యువకుడు ఆమె మీద మనసు పారేసు కున్నాడు.’

‘మీరేనా ఆ యువకుడు?’ వద్దనుకుంటూనే అడిగాను.

తల ఊపాడతడు.

‘నేనే ఆ యువకుడిని. ఆమెని గాఢంగా ప్రేమించాను. ఎంత గాఢంగా ప్రేమించానంటే, సమాజంలో నా స్థాయిని మరచిపోయాను. కులవృత్తిని విస్మరించాను. ఆమెకోసం సర్వం’ త్యజించాను.

బయట వాతావరణం మారినట్టుంది. గాలి బలంగా వీయసాగింది.

‘ఆమె కూడా నేనంటే ఇష్టపడింది. కానీ, ఆమె సమాజానికి భయపడింది. ఎందుకంటే, ఆ కాలంలో సమాజ నియమాలను ఉల్లంఘించిన వారితో చాలా క్రూరంగా వ్యవహరించేవారు. ఎవరయినా ఊరు వదలి పారి పోయినా, వెంటాడి మరీ చంపేవారు. అందుకని, పెద్దలను ధిక్కరించి అడుగు ముందుకు వేయటానికి మీనా జంకింది.’

బయట మెరుపులు మెరవసాగాయి. ఉండి ఉండి దూరంగా పిడుగులు పడుతున్న శబ్దం వినిపిస్తోంది. బయట ఉరిమినప్పుడల్లా, గది ఒక్కసారి వెలుతురుతో నిండి, మళ్లీ చీకటవుతోంది. ఆ వెలుగు నీడలలో అతని ముఖం భయంకరంగా

అనిపిస్తోంది.

'ఇంతలో పరిస్థితిమారింది. మా ఊళ్లోకి ఓ యువకుడు అడుగు పెట్టాడు. అతడు కూడా చిత్రకారుడే. చాలా గొప్ప చిత్రకారుడు. అతడు మీనా బొమ్మలకు మెరుగులు దిద్దటం ప్రారంభించాడు. మీనా అతని దగ్గర శిష్యరికం ఆరంభించింది.'

శక్తివంతమైన మెరపుమెరిసింది. కళ్లు చీకట్లు కమ్మాయి. అంత శక్తివంత మైన పిడుగు దగ్గరలో పడింది. కొండచరియ విరిగినంత శబ్దం వచ్చింది.

'ఆరంభంలో నేనేమీ అనుమానించలేదు. రాను రాను నాకు అనుమానం మొదలయింది. అతడిధ్యాసలో పడి మీనా నన్ను విస్మరిస్తోందని పించింది. మీనాను తిన్నగా అడిగే ధైర్యం చేయలేక పోయాను. అతడిని నిలదీశాను. మా ఇద్దరి ప్రేమ సంగతిచెప్పి మీనాపై ఆశలు పెంచుకో వద్దన్నాను. అతడు నవ్వాడు'. చివరి మాటలంటూంటేనే పెద్దగా మెరపు మెరిసి గది వెలుగుతో నిండింది. వెంటనే చీకటయింది. కానీ, ఆ వెలుతురులో క్షణకాలం కనిపించిన అతని ముఖం నాకు భయం కలిగించింది. కోపంతో క్రూరంగా ఉంది అతడి ముఖం. 'తానూ మీనాని ప్రేమిస్తున్నట్టు చెప్పాడు'. అతడి పిడికిళ్లు బిగుసుకున్నాయి. నాకెందుకో భయం పెరుగుతోంది. శ్యామ్ ఏకాగ్రతతో వింటున్నాడు.

'మీనాకి నా మీద ప్రేమ తగ్గిపోయిందని చెప్పాడు. అంతేకాదు, మీనా తనతో పారిపోవటానికి ఇష్టపడిందని చెప్పాడు. ఆమెని తీసుకుని దేశం వదలి పోవాలనుకుంటున్నట్టు చెప్పాడు. నాకు ఆవేశం ఆగలేదు. నాకు దక్కని మీనా ఇంకొకరికి దక్కకూడదని అన్నాను. అతడు నవ్వుతూ నా మాటలను కొట్టి పారేశాడు'.

ఉరుములు, మెరుపుల తీవ్రత పెరిగింది. వాటి మధ్య విరామ సమయం తగ్గుతోంది. దాంతో, గదిలో నీలిరంగు బల్బువెలిగి, ఆరుతున్నట్టు వెలుగు చీకట్లు దోబుచులాడసాగాయి. ఆ వెలుగుకు పిడుగుల శబ్దాలు తాళం వేస్తున్నాయి.

'మరుసటిరోజు మీనాను ఒంటరిగా కలసి నిలదీశాను. తనని క్షమించ మంది మీనా. అతడికళకు తాను దాసురాలనయ్యానంది. అతడివల్ల తన కళ సజీవంగా చిరకాలం నిలుస్తుందంది. ఇంకా ఏవోవో మాట్లాడింది. మీనాకు అతడు అతి ప్రాచీనమైన, గూఢమైన చిత్రలేఖన కళ నేర్పిస్తున్నాడని చెప్పింది'.

'ఏమిటి అది?' అడిగాను. నా ప్రశ్న పిడుగు శబ్దంలో కలసి పోయింది. అతడు విన్నట్లు లేడు చెప్పుకుంటూ పోయాడు.

'అది బౌద్ధులు తంత్రంపై ఆసక్తి పెంచుకుంటున్న కాలంలో అభివృద్ధి చెందిన మార్మిక చిత్రకళ. ఆ కళలో, చిత్రాలకు ప్రాణం పోయటం ఉంటుంది'. 'హోయ'మంటూ గాలి లోపలకు దూసుకు వచ్చింది. 'టకటక' కొట్టుకున్నాయి తలుపులు.

'చిత్రాలకు ప్రాణమా?' అడిగాడు శ్యామ్.

హఠాత్తుగా గుర్తుకువచ్చింది నాకు. నన్ను ఆ చిత్ర లేఖనాలలో ఆకర్షించిన విషయం. అవి జీవంతో తొణికిసలాడుతున్నాయి. నిజంగా, నదులు కదులుతున్నట్టున్నాయి.

గడ్డి పరకలు గాలికి ఊగుతున్నట్టున్నాయి.

'అవును. చిత్రాలకు ప్రాణప్రతిష్ఠ చేసే ప్రత్యేక తాంత్రిక చిత్రకళ. బౌద్ధం దేశం వదలి వెళ్లటంతో ఈ కళ కూడా మన దేశం వదలివెళ్లింది. కానీ, అతడు టిబెట్టు లామాల వద్ద ఈ కళను నేర్చుకున్నాడట. ఆ కళ ఆశ చూపి వాడు మీనాను లోబరచుకున్నాడు'.

'ఢమఢమఢమ' అంటూ పిడుగుల శబ్దం రెండు మూడు నిముషాలు వరుసగా వినిపించింది.

'అతడివల్ల మీనాకు అన్యాయం జరుగుతుందని చెప్పాను. అతడిది క్షుద్ర చిత్రకళ అనీ దానివల్ల ఫలితాలు ఘోరంగా ఉంటాయని వివరించాను. కానీ మీనా నా మాట వినలేదు. నాకేం చేయాలో తోచలేదు. ఒకవైపు మీనా నన్ను కాదన్నదన్న ఉక్రోషం. మరోవైపు ఈ క్షుద్ర కళ వల్ల మీనాకు ఏం అన్యాయం జరగుతుందోనన్న భయం నన్ను నిలవనీయ లేదు. ఏదో చేయాలి. కానీ ఏం చేయాలో తెలియటం లేదు'.

బయట పెద్దశబ్దంతో వర్షం కురవటం ఆరంభమయింది. కొండల ప్రాంతం కావటంతో వర్షం ఉధృతి తీవ్రంగా ఉంది. నీరనే సుత్తితో భూమిని ఎవరో మోదుతున్నట్టుంది. వర్షం చినుకు భూమిని తాకిన శబ్దం.

'ఇంతలో నేనో విషయం గమనించాను. మీనా రోజురోజుకీ చిక్కి పోతోంది. ఆమె అనారోగ్యం పాలయినట్టు ఆమె శరీరం కుంచించుక పోవటం వల్ల తెలుస్తోంది. కానీ ఆమె నవ్వుతూ, తుళ్లుతూ మాట్లాడు తోంది. నన్ను తప్పించుకుతిరుగుతోంది. ఏమీ చేయలేని నిస్సహాయ క్రోధంతో ఓ రోజు నేనో నిర్ణయం తీసుకున్నాను. అతడిని చంపేయాలని'

ఈసారి పిడుగు ఎంతో దగ్గరగా పడ్డట్టుంది. అదురుకి మా క్రింద భూమి కదలింది కింద పడకుండా ఉండటానికి గోడను పట్టుకోవాల్సి వచ్చింది.

'చంపినట్టు కూడా ఎవ్వరికీ తెలియకుండా, ఓరోజు వాడు అదృశ్య మయ్యేట్టు చేయాలని నిశ్చయించుకున్నాను. కొండపై నుండి, పరవళ్లు తొక్కే యమునలోకి తోయటం చక్కని పథకమని అనుకున్నాను. నా పథకాన్ని అమలు పరచేలోగా మీనా అదృశ్యమయింది.

వెయ్యి గొంతులతో ఏడుస్తున్నట్టు గాలి వికృతంగా వీచింది. ఆ ఏడుపుకు స్పందిస్తున్నట్టు పిడుగుల వర్షం కురిసింది.

'అంతా వెతికాను. పుట్టలు, గుట్టలు, అడవులు, కొండలు, కోనలు అంతా వెతికాను. ఎక్కడా మీనా కనబడలేదు. వాడినీ నిలదీశాను. వాడూ తనకు తెలియదని ఏడ్చాడు. మీనా లేక తాను క్రుంగిపోతున్నాడు. అది చూసి అతడిపై జాలి కలిగింది. ఇద్దరం కలిసి పిచ్చిగా మీనా కోసం వెతికాం. ఎక్కడా దొరకలేదు. అడవిలో ఏ పులో మీనాని ఎత్తుకు పోయుంటుం దన్నారు ఊళ్లో వాళ్లు. మీనా చచ్చిపోయిందనే నిశ్చయానికి వచ్చాము. రోజు రోజు క్షీణిస్తున్న అతడిపై ఊరంతా సానుభూతి చూపిస్తోంది. ఎవరెలాంటి వైద్యం చేస్తున్నా అతడు



కృశించి పోసాగాడు. అప్పుడే నాకో భయంకరమైన సత్యం తెలిసింది'. ఆ భయంకరమైన సత్యం వినటం కోసం అన్నట్టు ఒక్కసారిగా ప్రకృతి నిశ్శబ్దంగా అయింది. ఆ తరువాత ఆ సత్యం వినటం ఇష్టం లేనట్టు రెట్టించి గర్జించసాగింది. గుండె లోతుల లోంచి విహ్వలంగా కేకలు పెట్టసాగింది.

'అంతనీరసంలోను, అతడు ఉత్సాహంగా ఉండటం గమనించాను నేను. మీనా కూడా ఇలాగే ఉండేది. దాంతో నాకో అనుమానం వచ్చింది. రాను రాను ఆ అనుమానం స్థిరపడింది. ఎందుకంటే, మీనా కోసం అతడు వెతకటంలో నిజాయితీ లేదు. పైగా, అతడు క్రుంగి, కృశించటం మీనా మీద బాధతో కాదు. దానికి కారణం వేరే ఏదో ఉందనిపించింది. అందుకని, అనుక్షణం అతడిని నీడలా వెంబడించాను. అతడికి తెలియ కుండా అతడి ప్రతి చర్యను గమనించసాగాను.' ఊపిరి పీల్చటం కోసం అన్నట్టు ఆగాడు. కానీ అతడు ఊపిరి పీలుస్తున్నట్టు లేదు.

నా శరీరంలో వణుకు ప్రారంభమయింది.

'ఒకరోజు అతడు నా బొమ్మ గీస్తానన్నాడు. తనకి చావు తప్పదని, తన గుర్తుగా నా బొమ్మ గీసి నాకిస్తాననీ అన్నాడు. నా బొమ్మ గీయటం ఆరంభించాడు. తనకు ఎక్కువ కాలం లేదని, నా బొమ్మ త్వరత్వరగా గీయటం ఆరంభించాడు. చిత్రంగా, అనారోగ్యం ఏమీ లేకుండా నేను కృంగి పోసాగాను. అప్పుడు నాకు అర్థమయింది.

'ఏమిటి?' ఆత్రంగా అడిగాను.

'వాడు క్షుద్ర చిత్రలేఖనాన్ని ప్రయోగిస్తున్నాడు. అతడు గీసే బొమ్మలో ప్రతి గీత, ప్రతి రంగు, ప్రతి బిందువు, అతడు ఎవరి బొమ్మ గీస్తున్నాడో వారి ప్రాణాన్ని హరిస్తుంది. ఆ వ్యక్తి ప్రాణం పోసుకుని అది జీవం పోసుకుంటూ మనిషి మరణిస్తాడు. అతడి ప్రతిరూపం సజీవంగా ఉంటుంది.'

బయట వర్షం కాస్సేపు తెరపి ఇచ్చింది. కానీ నిశ్శబ్దంగా వికృతంగా ఉంది. 'అంటే.. మీనా బొమ్మగీసి...' శ్యామ్ మాట పూర్తి చేయలేక పోయాడు.

తల ఊపాడతడు.

'మీనా బొమ్మనుగీసి, ఆమె ప్రాణాన్ని బొమ్మకు పోశాడు. వాడి బొమ్మను కూడా గీసుకుంటున్నాడు. వాడూ సజీవమవుదామని. నా బొమ్మగీసి నా ప్రాణం హరించాలన్నది వాడి పథకం. నేను మరణించగానే, వాళ్లిద్దరూ బొమ్మలోంచి తాంత్రిక చిత్రకళ బంధాల నుంచి బయటకు వస్తారు. కలిసి జీవిస్తారు. వాళ్లని వేధించే నేను ఉండనూ. నాకు ఆ కళ నుండి బయట పడే మార్గం తెలియదు కనుక''.

'నమ్మశక్యంగా లేదు' అన్నాన్నేను. మళ్లీ మొదలయిన గాలిహోరులో నా మాటలు కలిసిపోయాయి.

'విషయం అర్థమైన నేను వాడిని నిలదీశాను. ఇదే తన పథకం అని ఒప్పుకున్నాక నేను ఆలస్యం చేయలేదు. ఈ చేతులతో వాడి పీక పిసికి చంపేశాను. కానీ... వాడిని చంపిన తరువాత నేను చేసిన పొరపాటు గ్రహించాను. నా మీనా ఎప్పటికీ ఆ బొమ్మలో సజీవంగా ఉంటుంది. శరీరం ధరించే వీలులేదు. విషయం అర్థమైన తరువాత ఏడ్చాను. తిట్టుకున్నాను. కొట్టుకున్నాను. కానీ లాభంలేకుండా పోయింది. ఆ తరువాత నాకూ భయంకరమైన సత్యం తెలిసింది. నా సగం ప్రాణం నా శరీరంలో ఉంది. సగం నా చిత్రపటంలో ఉంది. అందుకే ఎన్నాళ్లయినా నేనిలా సగం ప్రాణంతో బ్రతుకుతున్నాను. నా మీనా అలా చిత్రపటంలో బ్రతుకుతోంది. ఆమెకు విముక్తి కలిగితేనే నాకు విముక్తి'.

'ఆ బొమ్మలో ఉన్నది మీనానా?' అడిగాడు శ్యామ్.

తల ఊపాడతడు. 'కానీ... ఆ బొమ్మను మీరు భరించలేరు. ఆమె నా మీనానే కానీ నా మీనా కాదు. నా మీద ఎంతకోపం అంటే నన్ను ఛావనివ్వటం లేదు. బ్రతకనివ్వటం లేదు.'

'ఏదీ నన్ను చూడనీ' అన్నాడు శ్యామ్.

'వొద్దు.... ఆ బొమ్మను చూసినవారిపై చెడు ప్రభావం పడుతుంది' అన్నాడతడు.

'నాకలాంటి భయాలు లేవు' అంటూ బొమ్మ వైపు దూకాడు శ్యామ్.

అతడు అడ్డుపడ్డాడు. ఇద్దరూ పెనుగులాడసాగారు. నేను ప్రేక్షకుడి నయ్యాను. బయట వర్షం వేగం పెరిగింది. ఉరుములు, మెరుపులు ఎడ తెరిపి లేకుండా రాసాగాయి.

ఇద్దరి పెనుగులాటలో ఆ చిత్రపటం శ్యామ్‌కి దక్కింది. ఆ బొమ్మపై ఉన్న అడ్డు తొలగించసాగాడు శ్యామ్.

అతడు ఏడవ సాగాడు. 'వొద్దు వొద్దు' అని అరుస్తున్నాడు.

శ్యామ్ వినిపించుకోలేదు. చిత్రపటంపై అడ్డు తొలగించాడు.

'కెవ్వు'న కేక పెట్టాడు శ్యామ్.

చిత్రపటంలో, అమ్మాయి అందంగా ఉంది. నవ్వుతోంది. అంతలోనే ఆమె క్రూరంగా మారింది. కళ్లల్లో క్రోధం కనిపిస్తోంది.

అంతలో ఆమె ముఖం మారింది. వృద్ధురాలయింది. పళ్లు రాలిపోయాయి. అస్థిపంజరం కనిపించింది. అంతలో మళ్లీ అందంగా మారింది.

అది చూస్తుంటే కడుపులో తిప్పసాగింది. అరిగిపోయిన రికార్డు పదే పదే అదే పాడినట్టు, ఆమె జీవితం రికార్డు ఆ చిత్రపటంలో బంధితమైనట్టు అక్కడే తిరుగుతోంది.

'నేను భరించలేను' అంటూ అతడు పొర్లి పొర్లి ఏడవసాగాడు.

'దీని పని ఎలా పట్టాలో నాకు తెలుసు' వికృతంగా నవ్వాడు శ్యామ్. ఆ బొమ్మని తీసుకుని బయట వానలోకి పరుగెత్తాడు.

'వొద్దు వొద్దు' అంటూ అతడు వెంట పడ్డాడు.

ఇద్దరూ బయటకు పరుగెత్తారు.

మెరుపుల వెలుతురులో జరిగేది నేను చూస్తున్నాను.

కొండ అంచువరకూ వెళ్లిన శ్యామ్ బొమ్మను విసిరేశాడు. కానీ బొమ్మ అతడిని వదలలేదు. దాంతో బాలెన్స్ తప్పింది. అంత ఎత్తునుంచి



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### వజ్రం దాచిన చోటు

ఆరు గంటల పాటు దొంగలు యిల్లంతా గాలించారు. వజ్రం దొరకలేదు. దాని విలువ కనీసం అయిదు లక్షల డాలర్లు.

ఇంటి యజమానిని బెదిరించారు. అతడు నోరు విప్పలేదు. ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వస్తువులన్నీ విరగ్గొట్టారు. దొరకలేదు. చివరి ప్రయత్నంగా అతణ్ణి హింసించారు. ఎడాపెడా పిడిగుద్దులు గుద్దారు. ముక్కు విరిగింది. ఇనపరాడ్లతో బాదారు. పక్కటెముకలు విరిగాయి. అయినా చెప్పలేదు. చేసేది లేక వెళ్ళిపోయారు.

బతకనని తెలిసి, తన వ్యాపార భాగస్వామి కోసం ఒక నోట్ టైప్ చేశాడాయన.

''మరికొద్ది క్షణాల్లో నేను స్పృహ కోల్పోతాను. పక్కటెముకలు వూపిరి తిత్తుల్లో గుచ్చుకుపోయాయి. శ్వాస తీసుకోవటం కష్టంగా వుంది. మొత్తంమీద వజ్రాన్ని దొంగల్నించి కాపాడాను. దాని VANEలో దాచాను. తరువాత దాన్ని తీసుకుని నా వాటా, నా వారసులకు అందచెయ్యి''.

సమర్థులైన పోలీసులకు దొంగల్ని పట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే వజ్రమే దొరకలేదు. VANE అంటే ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. ఆయన బిజినెస్ పార్టనర్, డిటెక్టివ్ సహాయం అర్థించాడు.

''ఆయన చేతికర్ర వాడేవాడా?''

''అవును''

''అది ట్యూబులాగుంటుంది. లోపల వెదకండి..'' అన్నాడు డిటెక్టివ్

ఏ ఆధారంతో డిటెక్టివ్ ఆ సలహా యిచ్చాడు?

సమాధానం: స్పృహ కోల్పోవటానికి కొద్ది క్షణాలు ముందు, షాక్‌లో వున్నప్పుడు టైప్ చేశాడు యింటి యజమాని. కీ బోర్డు మీద పక్క పక్కనే వుండే అక్షరాలు 'V', 'C' లు ఒక దానికి బదులు ఒకటి నొక్కి, వుంటాడని డిటెక్టివ్ అనుమానం.

శ్యామ్, చిత్రపటంతో సహా క్రింద పడిపోయాడు.

'మీనా, మీనా' అని అరుస్తూ అతడూ అదృశ్యమయ్యాడు.

అంతలో పెద్దగాలి వీచింది. భయంకరమైన మెరుపు మెరిసింది. పిడుగు ఘోరంగా పడింది.

ఒక్క సెకనులో నా చుట్టూ ఉన్నవన్నీ అదృశ్యమై పోయాయి.

ఆకాశం క్రింద నిలబడ్డాను నేను. కానీ... నాపైన ఒక్క చినుకు కూడా పడటం లేదు. గాలి తాకటం లేదు...

*